క్లుప్తంగా

ఆక్రమణల తొలగింపు



నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలోని పలు ప్రాంతాల్లో టౌన్‌ప్లానింగ్ అధికారులు గురువారం ఆక్రమణల తొలగింపు పనులు చేపట్టారు. ఎన్‌ఎంసీ కమిషనర్ వైఓ నందన్ ఆదేశాల మేరకు పట్టణ ప్రణాళికా విభాగం ఆధ్వర్యంలో స్థానిక 30, 31వ డివిజన్లు పొదలకూరు రోడ్డు, కొత్తూరు ప్రాంతాల్లో రోడ్లను ఆక్రమించి నిర్మించిన నివాసాలు, దుకాణాలను తొలగించారు. అదేవిధంగా స్థానిక సుబేదారుపేట నక్కలోళ్ల సెంటర్ ప్రాంతంలో రోడ్లను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను, అనుమతుల్లేకుండా స్థానిక చిల్డ్రన్స్ పార్క్ ఎదురుగా ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాన్ని తొలగించారు. స్థానిక ట్రంకురోడ్డు లక్కీ షాపింగ్ మాల్ ప్రాంతంలో డ్రెయినేజీ కాలువలపై నిర్మించిన కట్టడాలను టౌన్ ప్లానింగ్ అధికారులు జేసీబీలతో కూల్చివేశారు.

జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై పోస్టర్ల ఆవిష్కరణ



నెల్లూరు రూరల్: సూపర్ జీఎస్టీ– సూపర్ సేవింగ్స్ వల్ల రవాణా రంగంలో కలిగే ప్రయోజనాలు తెలిపే పోస్టర్లు, బ్యానర్‌ను కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆయన కార్యాలయంలో గురువారం ఆవిష్కరించారు. సుమారు రూ.10 వేల నుంచి రూ.లక్ష వరకు ధరలు తగ్గినట్లు రవాణా శాఖ అధికారులు వివరించారు. కార్యక్రమంలో జీఎస్టీ కమిషనర్ కిరణ్‌కుమార్, డీటీసీ చందర్, ఆర్టీఓ ఎండీ మథాని, ఎంవీఐ మహమ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చర్చి వార్షికోత్సవం



నెల్లూరు(బృందావనం): బట్వాడిపాళెంలో ఉన్న ది సెంటినరి తెలుగు బాప్టిస్టు చర్చి 109వ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. సంఘ కాపరి, రెవరెండ్ వి.హరిపాల్ ఆధ్వర్యంలో జరిగిన ఆరాధనలో జీసస్ మినిస్ట్రీస్ పాస్టర్ రెవరెండ్ డాక్టర్ కె.జాషువా చౌదరి వాక్యోపదేశం అందించారు. ప్రత్యేక గీతాలు అలరించాయి. కార్యక్రమంలో సంఘ చైర్మన్ ఎస్.ప్రతాప్, సెక్రటరీ ఎం.పాల్సన్, ట్రెజరర్ జె.విజయకుమార్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

తమిళ మత్స్యకారులతో తీవ్ర ఇబ్బందులు



మాట్లాడుతున్న జువ్వలదిన్నె మత్స్యకారులు

నెల్లూరురూరల్: జిల్లా పరిధిలో తమిళనాడు మత్స్యకారులు వేట సాగిస్తుండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని జువ్వలదిన్నె మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో గురువారం మాట్లాడుతూ ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత దారుణంగా నష్టం వస్తోందని తెలిపారు. ఈ మధ్య కాలంలో తమిళనాడు బోట్లను పట్టించినా అధికారులు స్పందించడం లేదన్నారు. పెద్ద బోట్ల వల్ల మాకు చాలా నష్టం వస్తోందని వాపోయారు.

సైబర్ నేరాలపై అవగాహన

నెల్లూరురూరల్: నగరంలోని ఆదిత్య డిగ్రీ కళాశాలలో యువజన సంక్షేమ, సెట్నల్ ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, మానవ అక్రమ రవాణాపై విద్యార్థులకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సెట్నల్ సీఈఓ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈనెల 23వ తేదీ జిల్లా యువజనోత్సవాల్లో భాగంగా జానపద నృత్యం, జానపద పాటలు, కథా రచన, పెయింటింగ్, ప్రసంగ పోటీలు, కవితా రచన, సైన్సు మేళాలపై పోటీలు డీకేడబ్ల్యూ కళాశాలలో నిర్వహిస్తున్నామని, పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. అడిషనల్ సబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీహరి, యువజన శాఖ పర్యవేక్షకుడు అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

కేటాయించిన మైదానాల్లోనే బాణసంచా దుకాణాలు

నెల్లూరు సిటీ: ప్రభుత్వం కేటాయించిన మైదానాల్లోనే బాణసంచా దుకాణాలను ఏర్పాటు చేయాలని, రోడ్డు పక్కన దుకాణాలను ఏర్పాటు చేసి విక్రయాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నెల్లూరు ఆర్డీఓ అనూష గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. లైసెన్స్ ఉన్నవారికి లాటరీ పద్ధతిన దుకాణాలు కేటాయించనున్నట్లు తెలిపారు. లాటరీ డిప్‌లో పాల్గొనే వారు తప్పనిసరిగా జీఎస్టీ చెల్లించాలన్నారు. దుకాణాలు నిర్వహించే విషయంలో నిబంధనలు పాటించాలని సూచించారు.

పడిగాపులు.. పడరాని పాట్లు

- కర్నూలు సభకు తరలిన 250 ఆర్టీసీ బస్సులు
- ఓ వైపు వర్షం, మరో వైపు బస్సుల్లేక ప్రయాణికుల అవస్థలు



ఒక్క బస్సు కూడా లేని ఆర్టీసీ ప్రధాన బస్టాండ్

నెల్లూరు సిటీ: కర్నూలు జిల్లాలో జరిగిన జీఎస్టీ సూపర్ సేవింగ్స్ సభకు జిల్లాలోని 250 ఆర్టీసీ బస్సులను తరలించడంతో రెండో రోజు గురువారం కూడా ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు. దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు గంటల తరబడి వేచి చూడాల్సి వచ్చింది. అడపాదడపా వచ్చే బస్సుల కోసం ఎక్కువ మంది ప్రయాణికులు ఎగబడడంతో సీట్లు దొరక్క.. తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. కాగా నగరంలో చదువుకునే గ్రామీణ విద్యార్థులు దీపావళి పండగకు తమ సొంతూళ్లకు వెళ్లేందుకు భారీగా ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకున్నారు.

ఈ క్రమంలో ఓ వైపు ఎడతెరపి లేని వర్షం, మరో వైపు బస్సు రాకపోవడంతో అసహనానికి గురయ్యారు.

ప్రైవేటు దోపిడీ

ఆర్టీసీ బస్సుల రాకపోకలు లేక బస్టాండ్ ఖాళీగా దర్శనమిచ్చింది. ఈ క్రమంలో ప్రైవేటు వాహనాలు, ఆటోల్లో తమ ఊర్లకు వెళ్లేందుకు ఆశ్రయించారు. బస్సులు లేకపోవడం, వర్షం పడడంతో ఇదే అదనుగా వారు కూడా అధిక నగదు డిమాండ్ చేశారు. తప్పని పరిస్థితుల్లో కొందరు ప్రయాణికులు అధికంగా చెల్లించి సొంతూళ్లకు వెళ్లారు. కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై ప్రయాణికులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.



సీట్ పట్టేందుకు అవస్థలు పడుతూ..



బస్సు ఎక్కేందుకు పోటీపడుతున్న ప్రయాణికులు



బస్సుల కోసం ప్రయాణికుల పడిగాపులు

నేరస్తులపై కఠినంగా వ్యవహరించాలి



స్థానిక ఇన్‌స్పెక్టర్‌ను వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ అజిత

నెల్లూరు(క్రైమ్): నేరస్తులపై కఠినంగా వ్యవహరించాలని ఎస్పీ అజిత వేజెండ్ల పోలీసు అధికారులను ఆదేశించారు. ఆమె నగరంలోని చిన్నబజారు పోలీస్‌స్టేషన్‌ను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్‌లోని అన్ని విభాగాలతో పాటుగా మూడేళ్లకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలను స్థానిక ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావును అడిగి తెలుసుకున్నారు. రౌడీషీటర్లు, సస్పెక్ట్‌లు, పాతనేరస్తుల కదలికలపై నిఘా పెంచాలన్నారు. మహిళలు, చిన్నారుల అదృశ్యం ఘటనలపై తక్షణమే స్పందించి గాలింపు చర్యలు చేపట్టాలని, అలసత్వం ప్రదర్శిస్తే సహించేది లేదన్నారు. పగటి, రాత్రి గస్తీని ముమ్మరం చేసి నేరాలు జరగకుండా చూడాలన్నారు. గొలుసు దొంగతనాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పోలీసు సిబ్బంది సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి శుక్రవారం మెన్ గ్రీవెన్స్ నిర్వహిస్తున్నామని, అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ దారుణం

- ఆనం విజయకుమార్‌రెడ్డి
- బుజబుజనెల్లూరులో సంతకాల సేకరణ



మాట్లాడుతున్న ఆనం విజయకుమార్‌రెడ్డి

నెల్లూరు సిటీ: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో తీసుకొచ్చిన మెడికల్ కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయడం దారుణమని వైఎస్సార్‌సీపీ రూరల్ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రూరల్ నియోజకవర్గం బుజబుజనెల్లూరులో గురువారం సంతకాల సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే తమ చర్యలను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రూరల్ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డీకేడబ్ల్యూలో స్వచ్ఛోత్సవ్



నెల్లూరు (టౌన్): స్థానిక డీకేడబ్ల్యూ జూనియర్ కళాశాలలో కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ నెల్లూరు క్షేత్ర కార్యాలయ ఆధ్వర్యంలో స్వచ్ఛోత్సవ్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా క్షేత్ర ప్రచార సహాయకుడు హరికృష్ణ మాట్లాడుతూ దేశంలోని ప్రతిఒక్కరికీ 'పరిశుభ్రతే సేవ' అనే సందేశాన్ని ఇవ్వడమే స్వచ్ఛోత్సవ్ ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ రమణారెడ్డి, మేరా యువ భారత్ డీవైఓ మహేంద్రరెడ్డి, వైస్ ప్రిన్సిపల్ కొండయ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు ప్రసన్న, భారతి, శివయ్య, తులసి పాల్గొన్నారు.

కళా రూపాల్లో పోరాటాలు



మాట్లాడుతున్న పెంచలయ్య

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ప్రజలను పాటలు, కళారూపాల ద్వారా పోరాటాలకు సిద్ధం చేయడమే తమ లక్ష్యమని ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెంచలయ్య అన్నారు. నగరంలోని సంతపేటలో ఉన్న సీపీఐ జిల్లా కార్యాలయంలో గురువారం డప్పు కళాకారుల చేరిక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళారూపాల ద్వారా ప్రజల సమస్యలను సులువుగా తీసుకెళ్లవచ్చన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సూపర్‌సిక్స్ హామీలను నెరవేర్చలేదన్నారు. దివంగత వైఎస్సార్ హయాంలో కళాకరులకు గుర్తింపు కార్డులు అందజేసి పింఛన్లు అందజేశారని గుర్తుచేశారు. ప్రజానాట్య మండలికి పూర్వ వైభవం తీసుకువచ్చేలా కళాకారులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డప్పు కళాకారులు శీనయ్య, కొండయ్య, వివిధ సంఘాల నాయకులు ప్రభాకర్, మస్తాన్‌షరీఫ్, ఆదినారాయణ, నాగేంద్ర, సునీల్ పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ పట్టాలివ్వాలని ధర్నా



నెల్లూరు సిటీ: 35 ఏళ్లుగా నివసిస్తున్న 11వ డివిజన్‌లోని ఎన్టీఆర్ నగర్ వాసులకు రిజిస్ట్రేషన్ పట్టాలు ఇవ్వాలని సీపీఎం నగర కార్యదర్శి, వర్గ సభ్యుడు పి.సూర్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక ఆర్డీఓ కార్యాలయం వద్ద గురువారం ధర్నా చేపట్టారు. అనంతరం డీటీ వెంకటలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. స్థానిక ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నగర కమిటీ సభ్యుడు ఆవుల పెంచలయ్య, ఎన్టీఆర్ నగర్ కార్యదర్శి గోతం మురళి, నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, నగర కార్యదర్శి వర్గ సభ్యుడు నాగేశ్వరరావు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

బస్సు జాతాను జయప్రదం చేయాలి

నెల్లూరు (టౌన్): విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఇచ్ఛాపురం నుంచి హిందూపురం వరకు చేపడుతున్న బస్సు జాతాను జయప్రదం చేయాలని ఆ సంస్థ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్.మస్తాన్‌షరీఫ్ తెలిపారు. స్థానిక ఏఐఎస్ఎఫ్ కార్యాలయంలో బస్సు జాతాకు సంబంధించి వాల్ పోస్టర్లను గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బస్సు జాతా ఈనెల 22వ తేదీ నుంచి వచ్చేనెల 12వ తేదీ వరకు జరుగుతుందన్నారు. వచ్చేనెల 3న నెల్లూరు నగరంలో బస్సు జాతా ఉంటుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ.6,400 కోట్ల బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలను పీపీపీ విధానంలో ప్రైవేటీకరణ చేసే విధానాన్ని విరమించుకోవాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర పోస్టులను భర్తీ చేయాలన్నారు. జీఓ నంబర్ 77ను రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు శివంవర్మ, సోహిల్, అబ్దుల్, వికాస్ తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా దుకాణాలకు అనుమతులు తప్పనిసరి

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలో బాణసంచా దుకాణాల ఏర్పాటుకు పోలీస్, రెవెన్యూ, కార్పొరేషన్ అనుమతులు తప్పనిసరి అని కమిషనర్ వైఓ నందన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అనుమతులు పొందిన తర్వాతనే విక్రయాలు జరపాలని స్పష్టం చేశారు. కార్పొరేషన్ నిర్దేశించిన ప్రాంతాల్లో మాత్రమే దుకాణాలను ఏర్పాటు చేసుకోవాలని, అగ్ని ప్రమాదాలు సంభవించే అవకాశం ఉన్నందున నిర్దేశించిన మార్గదర్శకాలను పాటిస్తూ అనుమతుల మేరకు మాత్రమే బాణసంచా దుకాణాలను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. నిర్దేశించిన ప్రమాణాలను పాటించకుండా దుకాణాలను ఏర్పాటు చేయడం చట్టరీత్యా నేరమని, అలాంటి వాటిని పోలీస్ వారి సహకారంతో తొలగించి వేస్తామని హెచ్చరించారు.

18న డానీహాల్ వార్షికోత్సవం

నెల్లూరు(బృందావనం): బాప్టిస్టు చర్చి డానీహాల్ నూతన భవన వార్షికోత్సవ వేడుకను ఈనెల 18న నిర్వహిస్తున్నట్లు ఆ చర్చి కార్యదర్శి గుర్రం అరుణ్‌కుమార్ గురువారం తెలిపారు. సాయంత్రం 6 గంటలకు ప్రత్యేక ఆరాధన కార్యక్రమాన్ని నిర్వహించనున్నామన్నారు. 20న యూత్ రిట్రీట్‌ను ఏర్పాటు చేశామని, ఇందులో వాక్యోపదేశకుడిగా హైదరాబాద్ రాజ ఫెయిత్ మినిస్ట్రీస్ పాస్టర్ రాజాహేబెల్ రానున్నారని తెలిపారు.

అధికారులు అందుబాటులో ఉండాలి

నెల్లూరు(బారకాసు): నగరంలో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని, ఈ క్రమంలో సిబ్బందికి మూడు షిఫ్ట్‌ల డ్యూటీలు వేస్తున్నామని కమిషనర్ నందన్ తెలిపారు. ఇంజినీరింగ్ విభాగం అధికారులతో కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో వారాంతపు సమీక్షా సమావేశం గురువారం నిర్వహించారు. ప్రతి సచివాలయ అమెనిటీస్ కార్యదర్శి వారి పరిధిలో ప్రతిరోజు నీటి నాణ్యతను గమనించాలన్నారు. తాగునీటి కుళాయిల చార్జీలు ఇంకా రూ.48.25 కోట్ల బకాయిలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగం ఎస్ఈ రామ్మోహన్‌రావు, ఈఈలు శేషగిరిరావు, రహంతు జానీ, అనిల్‌కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ నరసింహారావు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

అధ్వానంగా న్యూ ఎంఐజీ రోడ్డు



గుంతల్లో నిలిచిన వర్షపునీరు

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలోని 24వ డివిజన్, కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డు కాలనీలో న్యూ ఎంఐజీ మూడో వీధిలోని మట్టి రోడ్డు అధ్వానంగా తయారైంది. అసలే గుంతలమయమైన మట్టి రోడ్డులో చిన్నపాటి వర్షానికి నీరు నిల్వ చేరిపోతోంది. దీంతో రాకపోకలు సాగించాలంటే స్థానికులు అనేక అవస్థలు పడుతున్నారు. అంతేకాకుండా సైడు కాలువలు లేకపోవడంతో మరింత ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు. రాత్రివేళల్లో ఎక్కడ గుంతలున్నాయో తెలియక ప్రజలు హడలిపోతున్నారు. కార్పొరేషన్ అధికారులు స్పందించి సిమెంట్ రోడ్డుతో పాటు సైడు కాలువలు నిర్మించాలని కోరుతున్నారు.

రాకపోకలకు ఇబ్బందుల్లేకుండా చర్యలు



ఆత్మకూరు బస్టాండ్ వద్ద చేస్తున్న పనులను పరిశీలిస్తున్న కమిషనర్

నెల్లూరు(బారకాసు): వర్షపు నీరు అండర్ బ్రిడ్జిలు, రోడ్లపై చేరి వాహనాల రాకపోకలకు అడ్డంకిగా మారకుండా అన్ని కాలువల్లో పూడికతీత, సిల్ట్ ఎత్తివేత పనులను వేగవంతంగా చేపట్టాలని నగర పాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్ అధికారులను ఆదేశించారు. పారిశుద్ధ్య నిర్వహణ పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక జీటీ రోడ్డు గాంధీ బొమ్మ, కనకమహల్ కూడలి, కొత్త హాలు కూడలి, జేమ్స్ గార్డెన్, వెంకట రామాపురం తదితర ప్రాంతాల్లో కమిషనర్ గురువారం పర్యటించారు. జీటీ రోడ్డులోని వివిధ ప్రాంతాల్లో రోడ్డు ఆక్రమణలు తొలగించే ప్రక్రియను పర్యవేక్షించారు. కాలువలను దాటి ఎలాంటి నిర్మాణాలు చేపట్టకుండా సంబంధిత విభాగాల సచివాలయ కార్యదర్శులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగం, శానిటేషన్ విభాగం, టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు, వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోండి

రాష్ట్ర ప్రభుత్వం యాక్సిస్ బ్యాంక్‌తో చేసుకున్న ఒప్పందం ప్రకారం నగరపాలక సంస్థ ఉద్యోగులు తమ జీతాల ఖాతాలను యాక్సిస్‌కు మార్చుకుని వారు అందిస్తున్న ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ వైఓ నందన్ సూచించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ తన చాంబర్లో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. యాక్సిస్ బ్యాంక్ సువిధా ఖాతాల ద్వారా లభించే ముఖ్య ప్రయోజనాలను వివరించారు. ప్రమాద బీమా కింద మరణించినా, శాశ్వత అంగవైకల్యం ఏర్పడినా రెగ్యులర్ ఉద్యోగికి రూ.కోటి, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగికి రూ.20 లక్షల వరకు చెల్లిస్తారన్నారు. సాధారణ మరణానికి సంబంధించి రెగ్యులర్ ఉద్యోగికి రూ.10 లక్షల వరకు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగికి రూ.2 లక్షల వరకు బీమా అందిస్తారని తెలిపారు. ప్రమాదవశాత్తు మరణించిన లేదా శాశ్వత అంగవైకల్యం పొందిన ఉద్యోగుల పిల్లల చదువు కోసం రూ.8 లక్షల వరకు యాక్సిస్ బ్యాంక్ అందిస్తుందన్నారు. ఆరోగ్య బీమా ద్వారా ఏడాదికి రూ.8,698 చెల్లిస్తే ఉద్యోగితో పాటు వారి జీవిత భాగస్వామికి, ఇద్దరు ఆధారిత పిల్లలకు కలిపి మొత్తం రూ.33 లక్షల వరకు బీమా కవరేజ్ ఉంటుందని తెలిపారు.

సీపీఆర్‌పై అవగాహన సదస్సు



అవగాహన కల్పిస్తున్న వైద్యులు



అగ్నిమాపక సిబ్బందితో రెడ్‌క్రాస్ ప్రతినిధులు

నెల్లూరు(బారకాసు): ఆపత్కాల పరిస్థితుల్లో మానవ హృదయ స్పందనను పునరుద్ధరింపజేసేందుకు చేసే సీపీఆర్ పద్ధతిపై నగరపాలక సంస్థ కమాండ్ కంట్రోల్ సెంటర్ మీటింగ్ హాల్లో ప్రత్యేక సదస్సును గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ కోఆర్డినేటర్ సుందరరాజు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ సీపీఆర్‌పై అవగాహన పెంపొందించుకోవాలని తెలిపారు. అనంతరం ఏసీ సుబ్బారెడ్డి మెడికల్ కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రాజేష్ సీపీఆర్ చేసే విధానాన్ని నమూనా పద్ధతిలో చేసి చూపించారు. అత్యవసర సమయంలో కార్డియాక్ అరెస్ట్ అయినప్పుడు సీపీఆర్ చేయాలని చెప్పారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ అర్బన్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఆఫీసర్ డాక్టర్ జిజియా, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కనకాద్రి, అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లలో పనిచేస్తున్న డాక్టర్లు, హెల్త్ సెక్రటరీలు పాల్గొన్నారు.

➡ నెల్లూరు(క్రైమ్): అగ్నిమాపక సిబ్బంది సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కోఆర్డినేటర్ సుందరరాజు సూచించారు. రైల్వేఫీడర్స్‌రోడ్డులోని జిల్లా అగ్నిమాపకశాఖ కార్యాలయంలో సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుందరరాజు మాట్లాడుతూ గుండె పనిచేయడం ఆగిపోయినప్పుడు లేదా శ్వాస నిలిచిపోయినప్పుడు ఇచ్చే అత్యవసర చికిత్స సీపీఆర్ అని తెలిపారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ జి.రాజేశ్వరి, ఐఆర్‌సీఎస్ మేనేజింగ్ కమిటీ సభ్యుడు రాజేంద్రప్రసాద్, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థి ఆత్మహత్యపై విచారణకు డిమాండ్



ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు


నెల్లూరు (టౌన్): కొడవలూరు మండలం రాజుపాళెంలోని శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో ఉదయ్‌కిరణ్ అనే విద్యార్థి ఆత్మహత్య చేసుకోవడంపై సమగ్ర విచారణ జరపాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వెన్ను నరేంద్ర డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక వీఆర్సీ సెంటర్‌లో గురువారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాల యాజమాన్యం ఎలాంటి తప్పు చేయకుంటే సూసైడ్ నోట్‌ను ఎందుకు చింపాల్సి వచ్చిందని ప్రశ్నించారు. విద్యార్థి మృతి ఘటనపై ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి ఆత్మహత్యకు గల కారణాలను వెలుగులోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు విక్రమ్, నాయకులు విష్ణు, బాబి, యశ్వంత్, జీవన్, సుమంత్, తాహీర్, అక్రమ్, సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత స్థాయి కమిటీ వేయాలి

శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి ఆత్మహత్యపై సమగ్ర విచారణ జరిపించాలని ఆంధ్రప్రదేశ్ పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నరహరి గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లాలో గత నాలుగు నెలల కాలంలో ఐదుగురు విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. విద్యాసంస్థల్లో వ్యవస్థ లోపాలు, మానసిక ఆరోగ్య సమస్యలు, చదువు, ఒత్తిడి, వసతి గృహాల్లో పర్యవేక్షణ కరువు తదితర కారణాల వల్లే ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయన్నారు. విద్యార్థుల ఆత్మహత్యలపై రాష్ట్ర ప్రభుత్వం ఉన్నతస్థాయి కమిటీ వేసి కారకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హాస్టల్స్‌లో సీసీటీవీ పర్యవేక్షణతో పాటు వేధింపు నివారణ కోసం కఠిన చట్టాలు అమలు చేయాలన్నారు. విద్యా వ్యవస్థలో ఒత్తిడిని తగ్గించేందుకు పరీక్షలు, మూల్యాంకన విధానంలో సంస్కరణలు తీసుకు రావాలన్నారు.

➡ శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థి ఆత్మహత్యపై సమగ్ర విచారణ జరపాలని ది పేరెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు మలిరెడ్డి కోటారెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు శిఖరం నరహరి గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నెల్లూరులో గత నాలుగు నెలల్లో ఐదుగురు విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడడం బాధాకరమన్నారు. వీటిపై విచారణకు ప్రభుత్వం కమిషన్‌ను వేయాలన్నారు. విద్యార్థులకు తగిన కౌన్సెలింగ్ ఇవ్వడమే కాకుండా ఒత్తిడి లేని చదువును అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని కోరారు.

క్రీడా పోటీలకు ఆహ్వానం



కలెక్టర్‌కు బ్రోచర్‌ను అందజేస్తున్న పెంచలరెడ్డి

నెల్లూరు(అర్బన్): అనంతపురం పట్టణంలో నవంబర్ 7 నుంచి 9 వరకు జరుగనున్న రాష్ట్ర స్థాయి రెవెన్యూ క్రీడలు, సాంస్కృతిక ఉత్సవాలకు ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ నాయకులు కలెక్టర్ హిమాన్షు శుక్లాను ఆహ్వానించారు. కలెక్టరేట్‌లో అసోసియేషన్ నాయకులు గురువారం కలెక్టర్‌ను కలిసి బ్రోచర్లను అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అల్లంపాటి పెంచలరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రస్థాయి ఉత్సవాలను, క్రీడలను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం తీవ్ర ఒత్తిడిలో ఉన్న రెవెన్యూ ఉద్యోగులకు క్రీడలు, సాంస్కృతిక ఉత్సవాలు మానసిక ఆనందాన్ని కలిగిస్తాయన్నారు. గ్రామస్థాయి వీఆర్ఏల నుంచి డిప్యూటీ కలెక్టర్ స్థాయి వరకు ఉద్యోగులు పాల్గొంటున్నారని తెలిపారు. రెవెన్యూ క్రీడల విజయవంతానికి సహకరించాలని కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో పలువురు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.